# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 14-05-2024** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **నాల్గవ విడత లోక్‌సభ ఎన్నికల పోలింగ్‌లో భాగంగా తొమ్మిది రాష్ట్రాలు, ఒక కేంద్ర పాలిత ప్రాంతంలోని 96 లోక్‌సభ స్థానాలకు జరిగిన ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి.**
2. **ఉత్తర్‌ప్రదేశ్‌లోని వారణాసి లోక్ సభ నియోజకవర్గానికి భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకులు, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈరోజు నామినేషన్ దాఖలు చేస్తారు.**
3. **సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా ఆంధ్రప్రదేశ్ లోని 175 శాసనసభ, 25 లోక్‌సభ స్థానాలకు నిన్న జరిగిన ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది.**
4. **తెలంగాణలో నిన్న జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో 63.19 శాతం పోలింగ్ నమోదైందని రాష్ట్ర ఎన్నికల సంఘం తెలిపింది.**
5. **దేశవ్యాప్తంగా కేంద్రీయ విశ్వవిద్యాలయాల్లో 2024 సంవత్సరానికి గాను యూజీ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే ఉమ్మడి ప్రవేశ పరీక్ష అడ్మిట్ కార్డులు విడుదలయ్యాయి.**

==========================

నాల్గవ విడత లోక్‌సభ ఎన్నికల పోలింగ్‌లో భాగంగా తొమ్మిది రాష్ట్రాలు, ఒక కేంద్ర పాలిత ప్రాంతంలోని 96 లోక్‌సభ స్థానాలకు జరిగిన ఎన్నికల్లో గత రాత్రి 8 గంటల వరకు సుమారు 62.84 శాతం ఓటింగ్ నమోదైందని కేంద్ర ఎన్నికల సంఘం తెలిపింది. ఎన్నికల సంఘం తెలిపిన వివరాల ప్రకారం ఆంధ్రప్రదేశ్‌లో 68.12 శాతం, బీహార్‌లో 55.90 శాతం, తెలంగాణలో 61.39 శాతం ఓటింగ్ నమోదైందని పేర్కొంది. జమ్మూ కాశ్మీర్‌లో 36.58 శాతం, జార్ఖండ్‌లో 63.37 శాతం, మధ్యప్రదేశ్‌లో 68.63 శాతం పోలింగ్ నమోదవ్వగా, . మహారాష్ట్రలో 52.75 శాతం, ఒడిశాలో 63.85 శాతం, ఉత్తరప్రదేశ్‌లో 57.88 శాతం, పశ్చిమ బెంగాల్‌లో 75.94 శాతంగా నమోదైందని కేంద్ర ఎన్నికల సంఘం తెలిపింది. పోలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా సాగిందని ఎన్నికల సంఘం తెలిపింది.కాగా జమ్ముకశ్మీర్ లోని శ్రీనగర్ పార్లమెంటరీ నియోజకవర్గంలో 36.58 శాతం ఓటింగ్ నమోదైందని, గత కొన్నేళ్లల్లో ఇదే అత్యధిక పోలింగ్ శాతమని తెలిపింది. 4వ దశ ఎన్నికలు ముగియడంతో, 23 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లోని 379 పార్లమెంటరీ నియోజకవర్గాలలో పోలింగ్ పూర్తయిందని కేంద్ర ఎన్నికల సంఘం తెలిపింది.

------------------------

ఉత్తర్ ప్రదేశ్లోని వారణాసి లోక్ సభ నియోజకవర్గానికి భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకులు,

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ రోజు నామినేషన్ దాఖలు చేయనున్నారు. ప్రధానమంత్రి ఈ ఉదయం స్థానిక కాలభైరవ మందిరంలో పూజల అనంతరం నామినేషను దాఖలుకు కలెక్టరేటుకు బయలుదేరుతారని, ఉదయం 9 గంటలకు గంగాతీరంలోని దశాశ్వమేధ్ ఘాట్‌లో పూజలు నిర్వహిస్తారని పేర్కొంది. ప్రధానమంత్రి నామినేషను కార్యక్రమానికి కేంద్ర మంత్రులు అమిత్ షా, రాజ్ నాథ్ సింగ్, ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ లతోపాటు పలు రాష్ట్రాల ముఖ్యమంత్రులు, ఎన్డీయే కూటమి నాయకులు హాజరురవుతారని తెలిపింది. ఆంధ్రప్రదేశ్ ఎన్డీయే మిత్ర పక్షాల నుంచి తెలుగు దేశం పార్టీ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు, జనసేన అధ్యక్షులు పవన్ కల్యాణ్ ప్రధానమంత్రి నామినేషన్ కార్యక్రమానికి హాజరుకానున్నారు.

---------------------------

సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా ఆంధ్రప్రదేశ్ లోని 175 శాసనసభ, 25 లోక్‌సభ స్థానాలకు నిన్న జరిగిన ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. రాష్ట్రంలో ఉదయం 7 నుంచి సాయంత్రం 5 గంటల వరకూ 68.12% పోలింగ్ నమోదైనట్లు కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించింది. పూర్తి పోలింగ్ శాతం త్వరలోనే వెల్లడిస్తామని తెలిపింది. సాయంత్రం 5 గంటల వరకూ నమోదైన పోలింగ్‌లో రాష్ట్రంలోనే అత్యధికంగా చిత్తూరు జిల్లాలోని గంగాధర నెల్లూరు నియోజకవర్గంలో 79.90% పోలింగ్ నమోదు కాగా.... అత్యల్పంగా అల్లూరి సీతారామరాజి జిల్లాలోని పాడేరు నియోజకవర్గంలో 45.78% పోలింగ్ నమోదైంది. ఉదయం 7 గంటలకు ప్రారంభమైన పోలింగ్ సాయంత్రం 6 గంటలకు ముగిసింది. అప్పటికి దాదాపు 3,500కు పైగా పోలింగ్ కేంద్రాల పరిధిలోని క్యూలైన్లలో ఓటర్లు వేచి ఉండటంతో వారందరికీ ఓటు వేసే అవకాశం కల్పించారు. దీంతో కొన్ని కేంద్రాల్లో రాత్రి 8 గంటల వరకూ, మరికొన్ని కేంద్రాల్లో రాత్రి 10 గంటల వరకూ పోలింగ్ కొనసాగింది. ఇంకొన్ని కేంద్రాల్లో మాత్రం రాత్రి 10 గంటల తర్వాత కూడా పోలింగ్ కొనసాగిందని రాష్ట్ర ఎన్నికల సంఘం తెలిపింది.

---------------------------

ఓటర్ల నమోదు ముందుగా చేపట్టడంతో పెద్దసంఖ్యలో పోలింగ్ నమోదైందని ఆంధ్రప్రదేశ్ ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా తెలిపారు. పోలింగ్ సమయం ముగిసిన తర్వాత నిన్న ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ, ఓటరు జాబితా విషయంలో ఈసారి ఎలాంటి ఫిర్యాదులు రాలేదని చెప్పారు. ఎక్కడా రీపోలింగ్ నిర్వహించాల్సిన అవసరం లేదని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా పలు చోట్ల చదురు మధురం ఘటనలు జరిగాయని, పల్నాడు, తెనాలి, మాచర్ల నియోజకవర్గాల్లో జరిగిన ఘటనలపై చర్యలు తీసుకున్నామని స్పష్టం చేశారు.సమస్యలు వచ్చిన ఈవీఎంలను వెంటనే పునరుద్దరించామని చెప్పారు. స్ట్రాంగ్ రూమ్‌లకుల ఈవీఎంల తరలింపు జరుగుతుందని వెల్లడించారు.

---------------------------

మరోవైపు తెలంగాణలో నిన్న జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో అక్కడక్కడా స్వల్ప సంఘటనలు మినహా పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. సాధారణ ఎన్నికల నాలుగో విడతలో భాగంగా తెలంగాణలోని 17 లోక్‌సభ నియోజకవర్గాలకు పోలింగ్ జరిగింది. సికింద్రాబాద్ కంటోన్మెంట్ అసెంబ్లీ నియోజకవర్గ ఉప ఎన్నిక కూడా పూర్తయింది. నిన్న ఉదయం 7 గంటలకు పోలింగ్ ప్రారంభమైంది.

---------------------------

దేశవ్యాప్తంగా కేంద్రీయ విశ్వవిద్యాలయాలు, ఇతర విద్యాసంస్థల్లో 2024 సంవత్సరానికి గాను యూజీ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే ఉమ్మడి ప్రవేశ పరీక్ష అడ్మిట్ కార్డులు విడుదలయ్యాయి. మే 15 నుంచి

24వరకు ఈ పరీక్షలు జరగనుండగా.. 18వ తేదీ వరకు అడ్మిట్ కార్డులను డౌన్లోడ్ చేసుకోవచ్చని నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ తెలిపింది. మొత్తం 261 కేంద్ర, రాష్ట్ర, ప్రైవేటు విశ్వవిద్యాలయ ప్రవేశాల కోసం నిర్వహించనున్న ఈ పరీక్షలకు 13.4లక్షల మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు.అభ్యర్థులు తమ అప్లికేషన్ నంబర్, పుట్టిన తేదీ వివరాలను ఎంటర్ చేసి అడ్మిట్ కార్డులను పొందవచ్చని పేర్కొంది.

---------------------------

తెలంగాణలో అకాల వర్షాలతో పంటలు, పండ్లు, కూరగాయల తోటలకు జరిగిన నష్టాలను అంచనా వేసి ప్రభుత్వానికి వెంటనే నివేదిక పంపాలని వ్యవసాయ, ఉద్యాన అధికారులను రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశించారు. మార్కెట్‌కు తీసుకువచ్చిన ధాన్యం తడవకుండా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని అధికారులకు సూచించారు.

---------------------------

దక్షిణ కర్ణాటక నుంచి వాయవ్య మధ్యప్రదేశ్ వరకు విస్తరించి ఉన్న ద్రోణి ప్రభావంతో రాబోయే నాలుగు రోజుల్లో ఆంధ్రప్రదేశ్ లోని పలు ప్రాంతాల్లో పిడుగులతో కూడిన వర్షాలు కురుస్తాయని అమరావతి లోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. కాగా.. ఈరోజు వడగాలుల ప్రభావం ఉండదని, శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు, విశాఖపట్నం, అనకాపల్లి, కాకినాడ, డా.బీఆర్ అంబేద్కర్ కోనసీమ, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, ఏలూరు, కృష్ణా జిల్లాల్లో పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని తెలిపింది. రాయలసీమ జిల్లాల్లో అక్కడక్కడా తేలికపాటి వర్షం కురిసే అవకాశం ఉందని పేర్కొంది.

ఇక తెలంగాణా రాష్ట్రంలో ఈరోజు నుండి ఈ నెల 17 వరకు పలు జిల్లాల్లో ఈదురుగాలులతో కూడిన ఓ మోస్తరు వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ లోని వాతావరణశాఖ కేంద్రం పేర్కొంది. ఈరోజు ఆదిలాబాద్, ఆసిఫాబాద్, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, సిరిసిల్ల, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ, నారాయణపేట, గద్వాల జిల్లాల్లో అక్కడక్కడ వర్షాలు కురవనున్నాయని తెలిపింది. రేపు మంచిర్యాల, భద్రాద్రి, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, జనగామ, సిద్దిపేట, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్ జిల్లాల్లో కూడా వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయని పేర్కొంది.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో పోలింగ్ ముగిసిన అనంతరం రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో ఈవీఎంలను భద్రపరిచారు. దీనిలో భాగంగా కర్నూలు జిల్లాలో పోలింగ్ ప్రశాంత వాతావరణంలో విజయవంతంగా జరిగిందని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి జి.సృజన పేర్కొన్నారు.ఎన్నికల సంఘం నిబంధనల మేరకు ఈవీఎంలను రాయలసీమ విశ్వవిద్యాలయంలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌లలో భద్రపరచామని కలెక్టర్ పేర్కొన్నారు. తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తంగా 7 అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో జరిగిన పోలింగ్ అనంతరం ఆదికవి నన్నయ్య యూనివర్సిటీలో రిసెప్షన్ సెంటర్ ఈవీఎంల చేరుకున్నాయని అధికారులు వెల్లడించారు. కాకినాడ జేఎన్టీయూ కళాశాలలో ఏర్పాటు చేసిన రిసెప్షన్ సెంటర్‌లోని స్ట్రాంగ్ రూముల్లో ఈవీఎంలను భద్రపరచామని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ జె.నివాస్. తెలిపారు. సాధారణ ఎన్నికలకు సంబంధించి మచిలీపట్నంలోని కృష్ణ విశ్వవిద్యాలయంలో

మచిలీపట్నం, పెడన, అవనిగడ్డ, పామర్రు అసెంబ్లీ నియోజకవర్గాలకు ఏర్పాటు చేసిన రిసెప్షన్ కేంద్రాలు, కౌంటర్లను జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ కలెక్టర్ పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ప్రకాశం జిల్లాలో జిల్లాలో స్వల్ప సంఘటనలు మినహా పోలింగ్ ప్రక్రియ ప్రశాంత వాతావరణంలో సజావుగా జరిగిందని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఎ.ఎస్. దినేష్ కుమార్ తెలిపారు. గుంటూరు పార్లమెంట్ నియోజకవర్గం, ఏడు శాసన సభ నియోజకవర్గాలకు సంబంధించిన ఈవిఎంలను ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని స్ట్రాంగ్ రూముకు తరలించారు. ఈ ప్రక్రియను జిల్లా కలెక్టర్ ఎం వేణుగోపాల్ రెడ్డి పర్యవేక్షించారు.

======================